శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

రాయపోల్‌లోని ఉమాపార్థివేశ్వర దేవాలయం

● ఏర్పాట్లు చేసిన అధికారులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. నంగునూరు మండలం ఖాతా గ్రామంలోని త్రిపుర సుందరీ సహిత మహాదేవుడి ఆలయం, బద్దిపడగ గ్రామంలోని రాజేశ్వరస్వామి ఆలయం, అక్కెనపల్లిలోని రాజ రాజేశ్వర ఆలయం, హుస్నాబాద్‌రూరల్ మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి దేవాలయం, రాయపోల్ మండలంలోని ఉమాపార్థివేశ్వరాలయం, నారాయణరావుపేట మండలం బుగ్గరాజేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు దౌల్తాబాద్‌లోని ఎత్తైన గుట్టపై వేలిసిన స్వయభూ శంబులింగేశ్వరస్వామి జాతర కొనసాగనున్నది. – సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 25

ఘనంగా మోడల్ స్కూల్ వార్షికోత్సవం

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ వన్నీసా, ఉపాధ్యాయులు

గజ్వేల్,ఫిబ్రవరి 25: మండల పరిధిలోని ముట్రాజ్‌పల్లి తెలంగాణ మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వన్నీసా మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ కీలకమన్నారు. కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సౌందర్య, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు మహ్మద్ రియాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి

విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న అధ్యాపకులు

గజ్వేల్, ఫిబ్రవరి 25: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ మాట్లాడుతూ దేశం నుంచి మొదటి నోబుల్ బహుమతి అందుకున్న శాస్త్రవేత్త సీవీ రామన్ అని కొనియాడారు. ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన పెంచుకొని అధ్యాపకుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. రాబో యే రోజుల్లో వివిధ అంశాలపై పట్టుసాధించాలన్నారు. ప్రతి విద్యార్థి రీసెర్చ్ చేసే స్థాయికి ఎదగాలని అప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు భవాని, అలివేలు, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, జ్యోతి, లావణ్య, శివశంకర్, పద్మ, అమలాదేవి పాల్గొన్నారు.

రాబోయేది నానో తరం

● జిల్లా వ్యవసాయాధికారి రాధిక

ఎఫ్‌పీసీ సంఘం సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 25: సంప్రదాయ యూరియా, డీఏపీ స్థానంలో ఇఫ్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నానో యూరియా, డీఏపీ వినియోగం ద్వారా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు వస్తున్నాయని జిల్లా వ్యవసాయాధికారి రాధిక అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో నానో యూరియా, డీఏపీ వినియోగంపై ఫర్టిలైజర్ డీలర్లు, ఎఫ్‌పీసీ సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమిలో యూరియా, డీఏపీ చల్లడం మూలంగా పూర్తిస్థాయి చేనుకు అందకపోవడంతో పాటు వృథా అవుతుందన్నారు. విచక్షణారహితంగా వాడటం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు అనేక అనారోగ్యాలకు కారణమవుతుందన్నారు. నానో యూరియా, డీఏపీలను పిచికారీ చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. నానో ఉత్పత్తులను వినియోగిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్న తొగుట ఎఫ్‌పీసీ చైర్మన్ జీడిపల్లి రాంరెడ్డి, అశోక్‌రెడ్డి, ఎల్లాగౌడ్, రంగయ్యను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి క్రాంతి, సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన ఏవో

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 25: మండలంలోని ఆయా గ్రామాల్లో వరి పొలాలను మంగళవారం మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా వేసిన వరి చిరుపొట్ట దశలో ఉన్నందున ఇప్పుడు మొగిపురుగు ఆశించే అవకాశం ఉంటుందని, నివారణకు కార్పస్ హైడ్రాక్లోరైడ్ 75ఎస్‌జీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్ లేదా టెట్రానిలిప్రోల్‌ను పిచికారీ చేసుకోవాలన్నారు. పది రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల ఆకులపై మంచు కమ్ముకోవడం, అలాగే నత్రజని అధికంగా వాడటం వల్ల పలు గ్రామాల్లో అగ్గితెగులు లక్షణాలు కనిపిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే దీనిని నివారించకపోతే తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

● నిలిచిపోయిన విద్యుత్ సరఫరా.. రాగి వైరు చోరీ

ఆకునూరులో చోరీ జరిగిన ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్సై నిరేశ్

చేర్యాల, ఫిబ్రవరి 25: మండలంలోని ఆకునూరులోని వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసే రెండు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి దాటిన అనంతరం పగులగొట్టి అందులో ఉన్న రాగి వైరును తీసుకువెళ్లారు. ఆకునూరు నుంచి మాసిరెడ్డిపల్లెకు, ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌కు వెళ్లే రూట్లలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి చోరీ జరగడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బోరు బావులకు నీటిని అందించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు మొదటగా సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌కు కరెంటు సరఫరా అయ్యే మెయిన్ వైర్లను గుర్తించి వాటిని కట్ చేశారు.అనంతరం గద్దెలపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను కిందపడేసి అందులోని రాగి వైరును ఎత్తుకుపోయారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో 44 కిలోల రాగి వైరు ఉంటుందని, రెండు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి 88 కిలోల వైరు చోరీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై నిరేశ్‌తో పాటు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చోరీ ఘటన పై ఎస్సై నిరేష్ కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను భిగించేందుకు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలి

● కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్‌లో నేషనల్ హైవే అథారిటీ ఇంజినీర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, ఫిబ్రవరి 25: హుస్నాబాద్ పట్టణంతో పాటు హనుమకొండ, సిద్దిపేట రూట్లలో జరుగుతున్న జాతీయ రహదారి పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులతో పాటు మండలంలోని జిల్లెలగడ్డ, ఉమ్మాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, వేసవి దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పైపులైన్ పనులను పది రోజుల్లో పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు సూచించారు. డ్రైనేజీ నిర్మాణ పనులు కూడా అసంపూర్తిగా ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ పట్టణంలో పనుల జాప్యం వల్ల పట్టణ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద మిగిలి ఉన్న పనులను సత్వరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మెడికల్ కళాశాల, మహిళా శక్తి భవనం నిర్మాణానికి ఉమ్మాపూర్, జిల్లెల గడ్డ గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం వడ్డించాలి: కలెక్టర్

నంగునూరు, ఫిబ్రవరి 25: హాస్టల్‌లో నాణ్యమైన సరుకులతోనే ఆహారం వండి వడ్డించాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం నంగునూరు మండలంలోని పాలమాకులలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డార్మెటరీలో విద్యార్థులు పడుకునేందుకు ఉపయోగిస్తున్న బెడ్లు, పరుపులను పరిశీలించారు. సరుకులు పంపిణీ చేసే కాంట్రాక్టర్ తక్కువ క్వాలిటీతో పంపిస్తే వెంటనే అధికారులకు వివరాలు అందించాలన్నారు. పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు ఆహారాన్ని పూర్తిగా తినేలా పర్యవేక్షించాలన్నారు. హాస్టల్ భవనం పైకప్పు అక్కడక్కడ పెచ్చులూడటం గమనించి వర్షాకాలంలో వాటర్ లీకేజ్ కాకుండా మరమ్మతు చేసేందుకు సంబంధిత ఇంజినీర్ చేత ఎస్టిమేట్ చేసి పంపాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి హమీద్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సరిత ఉన్నారు.

విద్యార్థినులు ముందంజలో ఉండాలి

● అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

రాయపోల్, ఫిబ్రవరి 25: దౌల్తాబాద్ మండలం శేరుపల్లి బందారం వద్ద గల మహాత్మాజ్యోతి బాపూలే బాలికల పాఠశాలను మంగళవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థినులు అమెకు స్వాగతం పలికారు.అనంతరం తరగతి గదిలోఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థినులకు ఆమె పాఠాలు బోధించారు. ఈ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు చదువులో ముందంజలో ఉండాలన్నారు. గురుకుల పాఠశాల,జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్య ంగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని అమె హెచ్చరించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, బందారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, మండల విద్యాధికారి గజ్జెల కనుకరాజు, ఏంజేపీ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ శ్రవంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

బందారం గురుకులంలో పాఠాలు బోధిస్తున్న గరిమాఅగర్వాల్

ఆర్యవైశ్యులు సంఘటితం కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న అమరవాది లక్ష్మీనారాయణ

కొమురవెల్లి, ఫిబ్రవరి 25: ఆర్యవైశ్యులు సంఘటితం కావాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం కొమురవెల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సత్రంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రేణికుంట గణేశ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు అగిర్ వెంకటేశ్, చింతల రవికుమార్‌తో కలిసి రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రత్నాకర్, జిల్లా అధ్యక్షుడు తనుకు ఆంజనేయులు, నాయకులు నవీన్‌కుమార్, మంచాల శ్రీనివాస్, హరినాథ్, మంకాల నవీన్‌కుమార్, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగేశ్ పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా విద్యార్థులు కృషి చేయాలి

జగదేవపూర్, ఫిబ్రవరి 25: లక్ష్య సాధన దిశగా విద్యార్థులు కృషి చేయాలని జగదేవపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతురాజన్న, మండల విద్యాధికారి మాధవరెడ్డి సూచించారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లు, కళాశాలల్లో చదివిన విద్యార్థులే నేడు గొప్పగొప్ప స్థాయిలో స్థిరపడ్డారన్నారు. చెడు వ్యసనాల వైపు వెళ్తే జీవితాలు అంధకారంలో మునిగిపోతాయన్నారు. విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జగదేవపూర్, మునిగడప కాంప్లెక్స్ హెచ్ఎంలు సైదులు, కనకయ్య, మండలంలోని ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో హుస్నాబాద్‌ను ముందుంచాలి

సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న కమిషనర్

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 25: స్వచ్ఛతలో హుస్నాబాద్ పట్టణాన్ని ముందు నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ కోరారు. పట్టణంలోని డంపింగ్‌యార్డును మంగళవారం ఆయన పరిశీలించి వార్డుల్లో తడి, పొడిచెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఇండ్లలో తడి, పొడిచెత్తను వేర్వేరుగా వాహనాల సిబ్బందికి అందించి అండగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవి కుమార్ పాల్గొన్నారు.

'భూతగాదాలకు తెరలేపడం సరికాదు'

మాట్లాడుతున్న నిమ్మ రాజీవ్‌రెడ్డి, అముదాల మల్లారెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 25: చేర్యాల ప్రాంత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భూ తగాదాలకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెరలేపుతున్నాడని చేర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు నిమ్మ రాజీవ్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ వంశపారంపర్యంగా తమ తాత మాజీ మంత్రి నిమ్మ రాజిరెడ్డి రాసిన వీలునామా ప్రకారం మొత్తం 17ఎకరాల 29గుంటల భూమిలో తనకు రావాల్సిన భూమిని తమ బాబాయి తన మామ పేరుమీద రిజిస్ట్రేషన్ చేశాడని, ఈవిషయంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి హస్తం ఉందని, కోర్టులో కేసు ఉండగా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. ఈ విషయంలో మా వద్ద ఉన్న కాగితాలను తహసీల్దార్‌కు చూపించామని తమకు కోర్టు నుంచి ఎలాంటి డైరెక్షన్ లేదని కాగితాల ప్రకారం సగం భూమి రావాల్సి ఉన్నా రిజిస్ట్రేషన్ ఆపలేమని అధికారులు తెలిపారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడు ఇరువర్గాలను కూర్చోబెట్టి న్యాయం చేయాలి తప్పా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వ్యవహార శైలి భూమి విషయంలో సరిగా లేదని, ఇరువర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తహసీల్ వద్ద హై డ్రామా

భూ తగాద విషయంలో తహసీల్ కార్యాలయం వద్ద హైడ్రామా నెలకొంది.మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డికి భూమి విషయంలో అన్యాయం జరుగుతుందని, రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని పట్టణంలోని పలు పార్టీల ముఖ్య నాయకులు, యువజన సంఘాల నాయకులు తరలివచ్చి ఆయనకు మద్దతుగా నిలిచారు.నిమ్మ రాజీవ్‌రెడ్డి బాబాయిల మధ్య జరుగుతున్న ఘటనలో ఆయన బాబాయి అనుకున్న వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికార పార్టీ నాయకులు తరలివచ్చారు. ఆ సమయంలో రెండు వర్గాలు గొడవ పడకుండా ఉండేందుకు పోలీసులు సైతం తహసీల్ కార్యాలయం వద్ద మొహరించారు.

ఆంగ్లభాషపై ఆసక్తిని పెంచుకోవాలి

ఆంగ్లభాష పోస్టర్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 25: ఆంగ్లభాషపై ఆసక్తిని పెంచుకోవాలని హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగిరి భిక్షపతి విద్యార్థులకు సూచించారు. మంగళవారం కళాశాలలో జరిగిన 'విలియం షేక్స్‌పియర్ రచనలు–ఆంగ్లభాష గొప్పతనం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్లను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ సబీఫాతిమా, అధ్యాపకులు కుమారస్వామి, అనిత, నైనాదేవి, రాజ్యలక్ష్మి, పరశురామ్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

చేర్యాల, ఫిబ్రవరి 25: కుటుంబ సర్వే నిర్వహిస్తున్న ఎమ్మూనరేటర్లు, ఆర్పీలు, సూపర్‌వైజర్లు అంకితభావంతో పని చేయాలని బీసీ కమిషనర్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సర్వేకు సంబంధించిన సూచనలు చేయడంతో పాటు మార్గదర్శనం చేశారు. కుటుంబ సర్వేలో పేరు నమోదుకాని వారిని గుర్తించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి

మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరి

జగదేవపూర్, ఫిబ్రవరి 25: సామాజిక తనిఖీ పకడ్బందీగా చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి యాదగిరి అధికారులకు సూచించారు. మంగళవారం మండల కార్యాలయంలో ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సామాజిక తనిఖీ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వారం రోజుల పాటు సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటిస్తుందని, వారికి ఈజీఎస్ సిబ్బంది సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామొహినొద్దీన్, ఎస్ఆర్పీ స్వామి, డీఆర్పీలు శిరీష, మమత, రాజు, అనిల్, ఏపీవో శైలజ, ఈసీ సుధాకర్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గోల్డ్ మెడల్స్ సాధించిన మిరుదొడ్డి మోడల్ స్కూల్ విద్యార్థులు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 25: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల అంతర్జాతీయ మార్షల్ అర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మిరుదొడ్డి మోడల్ స్కూల్/కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటారు. కరాటే పోటీల్లో హర్షిత, అక్షయ, శ్రేష్ట, రేవతి, సమీరా, సుస్మిత, శ్రీజ గోల్డ్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్స్‌తో పాటు 3 సిల్వర్ మెడల్స్ ఒక బ్రాన్జ్‌ను సాధించారు. కరాటేలో విద్యార్థులకు శిక్షణ అందించిన కరాటే మాస్టర్ బూరని శ్రీకాంత్‌కు మోడల్ స్కూల్/కళాశాల ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని, ఉపాధ్యాయబృందం అభినందించారు.

ఏకాగ్రతతో విద్య అభ్యసించాలి

ముస్త్యాల మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చేర్యాల, ఫిబ్రవరి 25: విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని సీఐ శ్రీను తెలిపారు.మంగళవారం మండలంలోని ముస్త్యాల తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, గంజాయి, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు, సైబర్ నేరాలు, ఈవిటీజింగ్, నూతన చట్టాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను జీవితంలో మర్చిపోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు చెప్పవద్దని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని ఇష్టపడి చదువుకోవాలన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్ నెంబర్ 87126 67434కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షం, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, పీసీలు ప్రశాంతి, కృష్ణ పాల్గొన్నారు.

చేర్యాల: ఆకునూరులో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

గజ్వేల్ మండలం బూరుగుపల్లిలో స్వయంపాలన దినోత్సవం

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

చేర్యాల, ఫిబ్రవరి 25: మండలంలోని ఆకునూరు ఎంపీపీఎస్‌లో మంగళవారం స్వయంపరిపాలన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మెడిచేల్మి అయోధ్య, ఉపాధ్యాయులు, ఏఏసీసీ చైర్‌పర్సన్ రాజేశ్వరి, సభ్యుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపల్లిలో...

గజ్వేల్, ఫిబ్రవరి 25: మండలంలోని బూరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్ఎం కృష్టారెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, కవిత, శ్రీనివాస్, ప్రసన్నలక్ష్మి, అబ్దుల్‌రఫీక్ పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీకి ఏర్పాట్లు

పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

కొమురవెల్లి, ఫిబ్రవరి25: ఈ నెల 27న జరిగే వరంగల్–ఖమ్మం–నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం కొమురవెల్లిలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

మల్లన్న ఆదాయం రూ.45,64,495